విశాలాంధ్ర

శనివారం 29 జులై 2023

రహదారులకు, డ్రైనేజ్ ల అభివృద్ధికి ప్రతి మండలానికి రూ.60 లక్షలు

- సగంలో నిలిచిన పనులకు ప్రాధాన్యత
- సోమవారం లోగా ట్రైబల్ వర్సిటీ ల్యాండ్ మ్యుటేషన్ జరగాలి
- సమీక్షా సమావేశంలో మంత్రి బొత్స

విశాలాంధ్ర-విజయనగరం: ఉపాధి హామీ నిధులతో బి.టి రోడ్లు, సిసి రోడ్లు, డ్రైనేజి ల అభివృద్ధి చేయడానికి ప్రతి మండలానికి 60 లక్షల రూపాయలు మంజూరు అయినట్లు రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఈ నిధులతో ఇదివరకే చేపట్టి నిధులు సరిపడక ఆగిపోయిన పనులను ముందుగా చేపట్టాలని తెలిపారు. అటువంటి పనులు పెండింగ్ లేని చోట కొత్త పనులకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. ఇప్పటికే ఎస్.కోట, రాజాం తప్ప అన్ని నియోజక వర్గాల నుండి 60 లక్షలకు సంబంధించిన ప్రతిపాదనలు అందాయని కలెక్టర్ తెలుపగా అందరి శాసన సభ్యులతో మంత్రి ఫోన్ ద్వారా మాట్లాడి పెండింగ్ పనులు ముందు పూర్తిచేయాలనీ, మిగిలిన నిధుల కు కొత్త పనులకు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో మంత్రి కలెక్టర్ నాగలక్ష్మితో కలసి పంచాయతి రాజ్ పనులు, భారీవర్షాలు, గిరిజన యూనివర్శిటీ పనుల పై సమీక్షించారు. ఉపాధి హామీ నిధులతో చేపట్టే 60 లక్షల పనులను వెంటనే మంజూరు అయ్యేలా చూడాలను డ్వామా పిడి కి సూచించారు. ట్రైబల్ యుని వర్సిటీ కి సంబంధించి 519 ఎకరాలు మ్యుటేషన్ జరగవలసి ఉందని, మ్యుటేషన్ జరిగితే గానీ తదుపరి నిర్మాణ పనులు ప్రరంభించలేమని డీన్ శ్రీనివాస రావు తెలుపగా సోమవారం లోగా మ్యుటేషన్ పూర్తి చేయాలని కలెక్టర్కు మంత్రి తెలిపారు. యూనివర్సిటీ కి అప్రోచ్‌రోడ్ కోసం ప్రతిపాదనలు పంపించగా ఈ.ఎన్.సి వద్ద పెండింగ్ ఉందని కలెక్టర్ తెలిపారు. మంత్రి పంచాయతి రాజ్ సెక్రటరీ తో ఫోన్‌లో మాట్లాడి త్వరగా మంజూరు చేయాలనీ కోరారు. త్వరలో ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేస్తారని, యూనివర్సిటీ పనులకు అత్యంత ప్రాధాన్యత నివ్వాలని మంత్రి అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరా, నీటి సరఫరా, పైప్ లైనింగ్ తదితర పనులు వేగంగా జరగాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం గానీ, జన నష్టం గానీ, ఇరిగేషన్ ట్యాంక్ ల గండ్లు గానీ జరిగాయా అని సంబంధిత అధికారులను మంత్రి అడిగారు. సాధారణ వర్షపాతం కంటే 36 శాతం అధికంగా నమోదు అయ్యిందని, అయితే జిల్లాలో ఎక్కడా ఎలాంటి నష్టం వాటిల్లలేదని కలెక్టర్ తెలిపారు. వర్షాలకు చెరువులన్నీ నిండి ఉంటాయి కావునా గండ్లు పడే అవకాశం ఉంటుందని, అధికారులు అప్రమతంగా ఉండాలని సూచించారు. సమావేశంలో రాజాం శాసన సభ్యులు కంబాల జోగులు, డి.ఆర్.ఓ గణపతిరావు, సి,పి.ఓ బాలాజీ, పంచాయతి రాజ్, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్ఈలు గుప్తా, ఉమాశంకర్, డ్వామా పిడి ఉమా పరమేశ్వరి, విద్యుత్ శాఖ ఎస్.ఈ లక్ష్మణ రావు, వ్యవసాయాదికారి తారక రామారావు, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిలూ ఆకర్షణలకు లోనుకావొద్దు..

జిల్లా సివిల్ జడ్జి నాగమణి హితవు

విశాలాంధ్ర-జామి: పాఠశాలస్థాయిలో చదువుకుంటున్న విద్యార్థినులు సమాజంలో ఉండే మంచి చెడులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, ఆకర్షణలకు లోబడి జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి కె.నాగమణి సూచించారు. శుక్రవారం మండలంలోని కుమరాం కెజిబివి స్కూల్‌లో విద్యార్థినిలకు న్యాయ అవగాహనా సదస్సు జరిగింది. ఈసదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా న్యాయమూర్తి విద్యార్థులకు మానవ అక్రమ రవాణా, చట్టాలు, న్యాయసలహాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం మైనర్ బాలికలకు చట్టాలు ఏ విదంగా రక్షణ ఇస్తున్నాయో వివరించారు. ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని, పెద్ద పెద్ద కలలను కనాలని, వాటిలో కొంత మేరకు విజయం సాదించేందుకు కృషి చేయాలన్నారు. ఇటీవల కాలంలో సమాజంలో మానవ అక్రమ రవాణా ఎక్కువయిందని వివరించారు. పైపైన ఆకర్షణల కారాణంగా విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. 18 ఏళ్ళలోపు వారు నేరం చేస్తే అందుకు తగిన శిక్ష విధించేలా చట్టాలు ఉన్నాయన్నారు. బాలికలు అణుక్షణం తగిన జాగ్రత్తలతో ఉండాలని, ఎవరిని నమ్మవద్దని సూచించారు. ఏ ఇబ్బంది కలిగినా తల్లిదండ్రులకు లేదా, ఉపాధ్యాయులకు తెలియజేయాలని చెప్పారు. డిప్యూటీ డిఇవో కె. వాసుదేవరావు మాట్లాడుతూ ఉన్నత శిఖరాలకు వెళ్ళాలనే లక్ష్యంతో చదువుకోవాలని, తల్లిదండ్రులకు ఆర్థిక భరోసాగా నిలవాలని సూచించారు. ఎస్ఎస్ఎ అధికారి, చైల్డ్‌వెల్ఫేర్ ప్రతినిధి మాలతీ మాట్లాడుతూ ఇటువంటి అవగాహనా కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో మానసిక బలాన్ని పెంచవచ్చన్నారు. జామి ఇన్‌చార్జి ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ దిశ, ఫోక్స్ చట్టంతోపాటు మానవ అక్రమ రవాణాపై విద్యార్థినిలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఎప్పుడైనా ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైనా ఈవ్‌టీజింగ్ వంటివి చేసినా పోలీసుల సహాయాన్ని తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపాల్ జ్యోతి, స్థానిక కుమరాం సర్పంచ్ పిన్నింటి ఆదిలక్ష్మి, ఎంపిటిసి కంది పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్న క్యాంటిన్ కు స్థల పరిశీలన చేసిన మాజీ ఎమ్మెల్యే కోళ్ల దంపతులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ నిరుపేద, రోజువారీ శ్రామిక, కర్షక పనివారిని దృష్టిలో పెట్టుకొని ప్రతిష్టాత్మకంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ అన్న క్యాంటిన్ మరల శృంగవరపు కోట మండల కేంద్రంలో మాజీ మంత్రి కోళ్ల అప్పలనాయుడు జ్ఞాపకార్థం ప్రారంభించనున్నామని, దీనికోసం శృంగవరపుకోట మండల కేంద్రంలో తహ శీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలాన్ని పరిశీలించడం జరిగిందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పుల రాంప్రసాద్ వెల్లడించారు. స్థలపరిశీలనలో శృంగవరపుకోట మండల పార్టీ అధ్యక్షులు జీ.ఎస్.నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, ఎస్.కోట పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు పోట్నూరు అప్పలరాజు (సాయిరాం), రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి చెక్కా కిరణ్ కుమార్, విశాఖ టీడీపీ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శులు కాపుగంటి శ్రీనివాసు, విరోతి శివాజీ, నియోజకవర్గ ఐటీడీపీ కార్యదర్శి అనకాపల్లి చెల్లయ్య, వేపాడ మండలం టీడీపీ పార్టీ ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు వాకాడ బాలు, కొత్తవలస మండలం టీడీపీ సీనియర్ నాయకులు లాలం అర్జునరావు, వెలమ కార్పోరేషన్ డైరెక్టర్ కొట్టాన విజయ్ కుమార్, వార్డు మెంబర్ సరిపల్లి రామకృష్ణ, యలమంచిలి అక్కునాయుడు, యువత పెదగాడ రాజు, దోమ సన్యాసిరావు, తిరుపతి, అక్కిరెడ్డి వేంకటరమణ, కొలుసు కిరణ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-కొత్తవలస: మండలంలోని కంటకా పల్లి గ్రామానికి చెందిన ఉల్లి నాగరాజు(40) చెరువులో పడి మృతి చెందినట్లు కొత్తవలస ఎస్ఐ హేమంత్‌కుమార్ తెలిపారు. కంటకాపల్లి గ్రామానికి చెందిన ఉల్లి నాగరాజు ఈనెల 26న సాయంత్రం కిరాణా సామాన్లు తెస్తానని కొత్తూరు గొప్పు వెళ్లాడని తన భార్య ఉల్లి లక్ష్మి తెలిపిందని, రాత్రికి తిరిగి రాకపోయేసరికి అన్నిచోట్ల వెతికితే.. ఊరు పక్కనే గల చెరువు వద్ద చెప్పులు, గొడుగు ఉన్నట్లు పేర్కొన్నారు. చెరువులో దిగి ఎంత వెతికినా దొరకలేదని మరుసటి రోజు 27వ తేదీ ఉదయాన్నే చెరువు వద్దకు వెళ్లి చూడగా నాగరాజు శవమై తేలినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. దీనిపై లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-గజపతినగరం: లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని గజపతి నగ రం మండల ప్రత్యేక అధికారి రమేష్ సూచించారు శుక్రవారం హౌసింగ్ డే పురస్క రించుకొని మండలంలోని కాలం రాజుపేట గ్రామంలో జగనన్న కాలనీ ని పరిశీలించారు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు కార్యక్రమంలో ఎంపీడీవో కొవ్వాడ కిషోర్ కుమార్ సర్పంచ్ గేదెల ఈశ్వరరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే



విశాలాంధ్ర-నెల్లిమర్ల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చెప్పారు. నెల్లిమర్ల మండలం సతివాడలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబుతో కలిసి శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా మన రాష్ట్రంలో పారదర్శక పాలన అందిస్తున్నట్లు చెప్పారు. లంచాలకు తావలేకుండా సంక్షేమ పథకాల మొత్తం నేరుగా లబ్ధిదారుల ఎకౌంట్ కి జమవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం, వైసిపి మండల అధ్యక్షులు చనమల్లు వెంకటరమణ, సర్పంచి రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసి రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ సమీక్ష

విశాలాంధ్ర-తెర్లాం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధిహామీ పీల్డ్ అసిస్టెంట్లతో జగనన్న ఇళ్ళు, సచివాలయ సముదాయ నిర్మాణాలు, ఐ.హెచ్. హెచ్.ఎల్.ఎస్., హౌసింగ్ పనిదినాల కల్పన తదితర అంశాలపై ఎంపీడీఓ ఎస్‌రామ కృష్ణ సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ పక్కాగృహం వుండాలనే ఉద్దేశంతో లబ్ధిదారులు వారి పక్కా ఇళ్ళు నిర్మించుకోవడం జరుగుతుందని కావున ముఖ్యంగా వారి సొంత స్థలంలో నిర్మించు కొంటున్న ఇళ్లకు నిత్యావరాలైన విద్యుత్, మంచినీటి కల్పన త్వరతగతిన అందించాలని, లేఔట్లో నిర్మిస్తున్న నిర్మాణాలలో విద్యుత్ వసతికి సూపరింటెండెంట్ అఫ్ ఇంజనీరు వారిని కోరామని, రైతు భరోసా, వెల్నెస్ కేంద్రాల నిర్మాణాలు దగ్గర వుండి సొంత పర్యవేక్షణ చేసి నిర్మాణం పూర్తిగా జరిగేట్లు చూడాలని మరియు బిల్లుల కోసం ఎప్పటికి అప్పుడు ఆన్లైన్ చేయాలని, మూడవ విడతలో అనుమతులు పొందిన భవనాల్లో పనులు నాణ్యతతో నిర్మింపబడి సకాలములో పనులు పూర్తి అయ్యేట్లు చర్యలను చేపట్టాలని, బిల్లుల చెల్లింపులు కొఱకు కచ్చితమైన హెచ్లో అప్లోడ్ చేయాలని ఇంజనీర్ అసిస్టెంటకు, హౌసింగ్ పనిదినాల కల్పనలో అలసత్వం ఉంచొద్దు అని నరేగా సిబ్బందికి ఆదేశించారు.

ఎస్సీలకు ప్రకృతి వ్యవసాయ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని కొండ గంగుపూడి పంచాయితీ పరిధిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 15మంది ఎస్సీ లబ్ధిదారులకు శుక్రవారం ఒక్కొక్క రికి రూ 10వేలు విలువ చేసే ప్రకృతి వ్యవసాయం కిట్లను ఎస్సీ కార్పొరేషన్ ప్రకృతి వ్యవసాయ శాఖల సమన్వయంతో పంపిణీ చేసారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అన్నదికూడా ప్రభుత్వంలో ఒక భాగమేనన్నారు. వీరి సేవలను రైతులు వినియోగిం చుకొని రసాయన రహిత వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన పంటలు పండించి ప్రభుత్వ మద్దతు ధరను పొందవచ్చన్నారు. ఎస్సీ కార్పొరేషన్, ప్రకృతి వ్యవసాయ శాఖ సంయుక్తంగా అందిస్తున్న 11రకాల నవధాన్యాల కిట్లను సద్వినియోగ పరుచుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జడ్పీటీసీ ఎస్ అప్పారావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఈర్లె సన్యాసి నాయుడు, వైస్ ఎంపీపీలు అడపా ఈశ్వరరావు, దాయిరి ముత్యాలమ్మ, ఎంపీడీఓ పట్నాయక్, మండల తహసీల్దార్ ప్రసన్నకుమార్, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, హౌసింగ్, ఎస్సీ కార్పొరేషన్, ప్రకృతి వ్యవసాయం అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సామాన్యులకు ఎంతగానో ఉపయోగపడ్డ జగనన్న సురక్ష

విశాలాంధ్ర-పూసపాటిరేగ: కొలవలస గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు మండలంలో గల 22 పంచాయతీల్లో జగనన్న సురక్ష కార్యక్రమం పూర్తయిందని మొత్తం 22 పంచాయతీలకు కలిపి 15,172 ప్రజలకు కావలసిన వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు దీనితోపాటు ప్రతి గ్రామంలోని ఆధార్ కార్డు కు ఫోన్ నెంబర్ నా లింక్ చేసుకొని వారిని గుర్తించి గ్రామంలోకే ఆధార కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఆధార కి సంబంధించిన ఏ సమస్య ఉన్న అక్కడే పరిష్క రించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని డిపార్ట్మెంట్ల అధికారులు మండల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల్లో కన్వీనర్ కోటాసీట్ల తగ్గింపు విధానం విరమించుకోవాలి

ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-బొబ్బిలి : రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యను సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందకుండా చేస్తున్న విధానంలో భాగంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలో కన్వీనర్ కోటా సీట్లు తగ్గింపు విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహా య కార్యదర్శి బి. రవికుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హాస్పిటల్ లో పేషంట్ల కోసం వచ్చిన అటెండర్లు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని అదే విధంగా హాస్పిటల్ ఇరువైపులా ప్రహరీ గోడ నిర్మించాలని. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ సీట్ల భర్తీలో విద్యా వ్యాపారానికి తెర లేపి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోందని ప్రభుత్వ తీరుపై వారు మండిపడ్డారు. ప్రభుత్వం ద్వారా వేల కోట్లు ఖర్చు చేసి వైద్య కళాశాలలను ప్రారంభిస్తున్నానని రాష్ట్ర ముఖ్యమంత్రిరి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆర్భాటంగా ప్రకటించుకుని నేడు వైద్య కళాశాలలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన 107,108 జీఓల ద్వారా ఈ విషయం తేటతెల్లమవుతుందన్నారు. మూడు కేటగిరిలుగా సీట్లను భర్తీ చేసి వాటిలో 50 శాతం సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్ఆర్ కేటగిరీలకు కేటాయించడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 25 శాతం మాత్రమే రిజర్వేషన్ సీట్లను కేటాయించడం సరికాదన్నారు. తెలంగాణలో నూతన కళాశాలలు ప్రారంభిస్తున్న నేపథ్యంలో కన్వీనర్ కోటాలోనే సీట్లు భర్తీ చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని కూడా ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి గమనంలోకి తీసుకోకపోవడం ప్రభుత్వ ధర్మార్థ చర్యలని ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వైద్య విద్యలో కన్వీనర్ కోట సీట్లు తగ్గింపులో జారీచేసిన జీవోలు ఉత్తర్వులను వెనక్కి తీసుకుని పేద విద్యార్థులకు వైద్య విద్య చేరువయ్యే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ నాయకులు పోల్రాజు ,శరత్ ,సాయి, నాని ,తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో మందుల తయారీ

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో గల సోమ లింగాపురం ఐసిఆర్‌పి బొత్స శంకర్రావు ప్రకృతి వ్యవసాయంలో మందుల తయారుచేయు విధానం రైతులకు అవగాహన కల్పించారు. ఇది వరి, మొక్కజొన్న పంటలకు అన్ని దశల్లో వాడవచ్చునని. పంటలు పెరుగుదలకు తెల్లదోమ, పచ్చదోమ నివారణకు, ఉపయోగపడునన్నారు. ద్రవాలు తయారు చేసే విధానం వివరిస్తూ.. వేపాకులు 10 కేజీలు, జిల్లేడు ఆకులు10 కేజీలు తీసుకొని చిన్నచిన్న ముక్కలుగా చేసి 200 లీటర్ల నీరుపట్టే డ్రమ్ములో వేసి 180 లీటర్లు నీటిని వేసి నీడలో పెట్టి, ఉదయం, సాయంత్రం సవ్య దిశలో తిప్పాలన్నారు. 5 లేదా 6 రోజులకు ద్రావణం తయారగును, తయారైన ద్రావణం ఒకటి ఈస్ట్ పది నిష్పత్తిలో అనగా లీటరు ద్రావణం 10 లీటర్ల నీటిలో కలిపి అన్నిరకాల పంటలకు అన్నిదశల్లో పిచికారి చేయవచ్చును. ఈ ద్రావణం వాడటం వల్ల ఎటువంటి ఖర్చు ఉండదన్నారు.

పేరు మార్పు

నేను శ్రీ రాజా వత్సవాయ శాంతానంద సరస్వతి (కొత్త పేరు SRI RAJA VATSAVAYA SANTHANANDA SARASWATHI). W/O శ్రీ రాజా వత్సవాయ ఆనంద కుమార్ వర్మ, డోర్ నెం 2-17-19, రాణి సుభద్రయ్యమ్మ పేట,తుని,వార్డు11,కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్-533401. మరియు నా యొక్క పాత పేరు శ్రీ రాజా వత్సవాయ శాంతానంద సరస్వతి (SRI RAJA VATSAVAYA SANTHANANDA SARASWATI) ను మార్పు చేసుకుని ఇక నుండి అన్ని కార్యకలాపాల ను జరుపుకునే నిమిత్తం నా యొక్క కొత్త పేరును శ్రీ రాజా వత్సవాయ శాంతానంద సరస్వతి (SRI RAJA VATSAVAYA SANTHANANDA SARASWATHI) గా మార్పు చేసుకోవడమైనది.

నేడు పట్టణానికి ఇరువురు మంత్రులు రాక

జిల్లా వైకాపా అధ్యక్షులు పరీక్షిత్ రాజు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: నేడు పార్వతీపురం మన్యం జిల్లాకు రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ, ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర గిరిజన శాఖమంత్రి పీడిక.రాజన్నదొర రానున్నారని జిల్లా వైకాపా పార్టీ అధ్యక్షులు శత్రుచర్ల. పరీక్షిత్ రాజు తెలిపారు. శనివారం పార్వతీపురం నియోజకవర్గంలో జిల్లా వైకాపా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం వీరిరువురు మంత్రులు చేపట్టనున్నా రన్నారు. అలానే పార్వతీపురం, కురుపాం,పాలకొండ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు,పాముల పుష్ప శ్రీవాణి, విశ్వసరాయి కళావతి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, హాజరవుతారని కావున నాలుగు నియోజకవర్గాల సర్పంచులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, చైర్మన్లు, వైస్ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బురదనీటి సమస్య పరిష్కారానికి చర్యలు



విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణ ప్రజలకు బురదనీటి సమస్యనుంచి విముక్తి కలిగించేందుకు చర్యలు ముమ్మరం చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులతో కలసి బూస్టర్ పంప్‌హౌస్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి తోటపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని బూస్టర్ పంప్ హౌస్ వద్ద శుద్దీకరణ చేయడం జరుగుతుందన్నారు.బూస్టర్ పంప్ హౌస్ లో చిన్న చిన్న మరమ్మత్తులు కారణంగా పట్టణానికి బురదనీరు వస్తుందని దాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ జి.ఆనంద్ ఉన్నారు.

ఎమ్మెస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ

విశాలాంధ్ర-మక్కువ : మండలంలో వెంకట భైరపురం గ్రామ పంచాయతీలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మన వెంకట భైరిపురం గ్రామంలో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మరడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సర్పంచ్ మరడ వెంకట రత్నం చేతుల మీదుగా సుమారు 24 యానాదులు (గిరిజన) కుటుంబాలకు 300 జీడిమామిడి మొక్కలు ఇచ్చి వారి పోడు వ్యవసాయం నకు సహకారాలు అందించారు. ప్రకృతి ని పరిరక్షించేందుకు తన వంతుగా గ్రామం లో ఎవరైనా మొక్కలు పెంచడానికి ఆసక్తి చూపించినట్లయితే ఆదాయం, ఆరోగ్యంను ఇచ్చే పండ్ల మొక్కలు ఇవ్వడానికి తమ సంస్థ సిద్ధంగా ఉంటుందని ఎమ్మెస్సార్ ఫౌండేషన్ అధ్యక్షులు మరడ శ్రీనివాసరావు తెలియపరిచారు.

విద్యాశాఖ అధికారులకు హైకోర్టు నోటీసులు

విశాలాంధ్ర-కురుపాం: గతనెలలో కురుపాంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అమ్మ ఒడి నిధుల విడుదల సభకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులను రాజకీయ సభకు తరలించటంపై న్యాయవాది జాడ శ్రావణ్ వేసిన కేసు పై స్పందించిన హైకోర్టు విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, విద్యాశాఖ కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది.

బాధితుల నష్టపరిహారంపై దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం: వివిధ ఎస్సి, ఎస్టి కేసుల్లో బాధితుల నష్టపరిహారంపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. జిల్లా ఎస్సి, ఎస్టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతి కేసును పరిశీలించి వివరాలు అడిగారు. కేసుల విచారణ పక్కాగా నిర్వహించి త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొత్తం 13 కేసులలో వివిధ దశలలో రూ.13 లక్షలు నష్టపరిహారంగా మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ఈ సమావేశంలో పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకటరావు, అదనపు ఎస్పీ డా. ఓ.దిలీప్ కిరణ్, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఎఎస్పీ సునీల్ షరోన్, పాలకొండ డిఎస్పీ జివి కృష్ణారావు, జిల్లా ప్రధాన అగ్నిమాపక అధికారి కె. శ్రీనుబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి ఎండి గయజుద్దీన్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం. దేవుళ్ల నాయక్, కమిటీ సభ్యులు జి. చంద్రయ్య, డి. శ్రీనివాసరావు, వేణుగోపాలరావు, జి. తిరుపతిరావు, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులను అడ్డగించినా చలనం లేని రాష్ట్ర ప్రభుత్వం ...!

లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి

విశాలాంధ్ర-సాలూరు టౌన్: అటవీ ఆధారిత బహుళ ఉత్పత్తుల సంస్థ ఏర్పాటుకు సంబంధించి అధికారులు ఒడిస్సా రాష్ట్రాన్ని పర్యటించ దానికి వెళ్ళిన వారిని వెనక్కి పంపించడం రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గుచేటు అని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జి విమర్శించారు. శుక్రవారం బాబ్జీ సాలూరు పట్టణం సంగీత పాఠశాల వద్ద, జాహ్నవి క్లినిక్ లో పత్రిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీశెట్టి బాబ్జి మాట్లాడుతూ అటవీ అథారిత బహుళ ఉత్పత్తి సంస్థ ఏర్పాటుకు లబ్ధి దారులను ఎంపిక చెయ్యడానికి ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దు ప్రాం తాల్లో పర్యటించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెర్ప్ అధికారులను జిల్లా అధికారులను ఒడిశా అధికారులు వెనక్కి పంపడం రాష్ట్ర ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శన భీశెట్టి బాబ్జి అన్నారు. గడచిన రెండు నెలల క్రితమే కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ వివాదాస్పద గ్రామాల్లో పర్య టించి ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారి కొఠియా సర్కిల్ ఇన్స్పెక్టర్ రోహిణి పతి, వారి సిబ్బందిని గోబ్యాక్ ఆంధ్ర పోలీస్ అని నినాదాలు చేసి వెనక్కి పంపేసారని అప్పుడు కూడా జిల్లా అధికారులు, మంత్రులు, ముఖ్యమంత్రి, కనీసం నోరు విప్పిన పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు, ఒడిశా అధికారులు,నాయకులు శృతిమించి ప్రవర్తిస్తున్న పరిస్థితి ని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని తెలియజేశారు.అలాగే కొఠియా వివాదాస్పద గ్రామాల్లో ఒక్కటయిన పట్టుచెన్నూరు పంచాయతీ లోమహిళలతో సమావేశం నిర్వహిస్తుంటే ఒడిశా అధికారులకి ఇబ్బంది ఏమిటో అర్థం కాలేదని సరిహద్దు ప్రాంతాల్లో రెండు రాష్ట్రాలకి సమాన హక్కులు కలిగివున్న సంగతి మర్చిపోయి ప్రవర్తిస్తున్న ఒడిశా నేతలకు అధికారులకు తగిన గుణపాఠం చెప్పాలని, వారు భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం కి సుప్రీంకోర్టు కి అందించవలసిన డాక్యుమెంటరీని తయారు చేస్తున్నారనే విషయం రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి మరిచిపోతున్నారని, దీనివల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, వివాదాస్పద గ్రామాల్లో ని గిరిజనులు నష్టపోతారని అన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణ ధ్యేయం కావాలి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం : జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణ ధ్యేయం కావాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ జిల్లా స్థాయి కమిటి సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు అవగాహన ప్రధానం అన్నారు. పాఠశాలలు, కళాశాలలు, ఐటిఐ, పాలిటెక్నిక్, కృషి విజ్ఞాన కేంద్రం తదితర అన్ని విద్యా సంస్థలలో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. విద్యా సంస్థలలో ఉదయం జరిగే అసెంబ్లీ సమయంలో మాదక ద్రవ్యాల దుష్ప్రభావాల పట్ల ఐదు నిమిషాలు విద్యార్థులకు విధిగా తెలియజేయాలని స్పష్టం చేశారు. ఇందులో 9, 10 తరగతుల విద్యార్థులు విధిగా భాగస్వామ్యం కావాలని ఆదేశించారు. జిల్లాలో డి అడిక్షన్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బగాది జగన్నాథరావును ఆదేశించారు. అటవీ ప్రాంతంలో గంజాయి తదితర ఎటువంటి మాదక ద్రవ్యాల పంటలు పండించకుండా నిఘా ఉంచాలని జిల్లా అటవీ అధికారి జిఎపి ప్రసూనను ఆదేశించారు. పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణపై ఎస్ఇబి పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుండి రవాణా అవుతున్నాయని చెప్పారు. విద్యా సంస్థల టోల్ ఫ్రీ నంబరు, ఇతర సమాచారంతో బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా అటవీ అధికారి జిఎపి ప్రసూన మాట్లాడుతూ జిల్లాలో 74 బీట్లు ఉన్నాయని, అందులో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకటరావు, అదనపు ఎస్పీ డా. ఓ.దిలీప్ కిరణ్, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఎఎస్పీ సునీల్ షరోన్, పాలకొండ డిఎస్పీ జివి కృష్ణారావు, జిల్లా ప్రధాన అగ్నిమాపక అధికారి కె. శ్రీనుబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి ఎండి గయజుద్దీన్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం. దేవుళ్ల నాయక్, కమిటీ సభ్యులు జి. చంద్రయ్య, డి. శ్రీనివాసరావు, వేణుగోపాలరావు, జి. తిరుపతిరావు, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్. కృష్ణ, విద్యా శాఖ ఎడి ఎం. రమాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

విశాలాంధ్ర-పాలకొండః విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఎంవీ గోపాలరావు ఆదేశాల మేరకు బి.జీవరత్నం, డీడీపీ .రమణమూర్తి ల అధ్యక్షతన శుక్రవారం పాలకొండ డివిజన్ కార్యాలయ ప్రాంగణం లో విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన దశల వారీ ఆందోళన కార్యక్రమం లో భాగంగా రెండవ రోజు అయిన శుక్రవారం భోజన విరామ సమయం లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాలకొండ టి గోపాల కృష్ణ మూర్తి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్ చక్రవర్తి, ఏఏవో లు, జేఏవో లు, ఏఈ లు, జేఈ లు మరియు డివిజన్ లోని అన్ని కార్మిక సంఘాల, అసోసియేషన్ ల నాయకులు, కార్యవర్గ సభ్యులు, కార్మిక సోదర సోదరీమణులు అందరు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారని ఉద్యోగులు ఒక ప్రకటనలో తెలిపారు.

మొక్కలు నాటిన కలెక్టర్ దంపతులు

విశాలాంధ్ర-బెలగాం : గ్రీన్ ఆంధ్రా-గ్రీన్ పార్వతీపురం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ నిశాంత్ కుమార్ దంపతులు మొక్కలను నాటారు. గ్రీన్ ఆంధ్రా-గ్రీన్ పార్వతీపురం కార్యక్రమం ను ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వద్ద అటవీ శాఖ శుక్రవారం నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కల ఆవశ్యకత ఉందన్నారు. మొక్కలు ఎక్కువగా నాటాలని ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వాతావరణంలో విపరీతమైన మార్పులు వస్తున్నాయని తద్వారా భావితరాల మనుగడకు ముప్పు వాటిల్లుతుందని చెప్పారు. ప్రకృతిని పరిరక్షించుకోవాలని తద్వారా వాతావరణ సమతౌల్యం వస్తుందని, మొక్కలునాటి పార్వతీపురం పట్టణాన్ని పచ్చదనానికి నిలయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి జిఎపి ప్రసూన, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. బి. వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు ఈ ప్రభుత్వానికి పట్టవా ?

విశాలాంధ్ర-సీతంపేట: రైతులు సమస్యలు ఈ ప్రభుత్వానికి పట్టవా, ఉపాధి హామీ పనులు వల్ల రైతులకు ఎటువంటి ప్రయోజనం లేకుండాపోయిందని టిడిపి నాయకురాలు పడాల భూదేవి అధికార యంత్రాంగాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం దేవనాపురం పరిధిలో గల సాగు కాలువ పూడికతో నిండిన కారణంగా నీరు సాగలేదని రైతులంతా కలసి ఒక నిర్ణయానికి వచ్చారు. ఆయకట్టు రైతులంతా శ్రమదానంగా కాలువ పూడికతీత పనులు చేస్తున్న రైతులను చూసిన భూదేవి కాలువ వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడారు. వెంటనే ఉపాధి హామీ అధికారుల తో ఫోన్ లో మాట్లాడగా పనులు మంజూరు అయినప్పటికీ మస్టర్ సీటు రావకపోవడం వల్లే పనులు చేయలేకపోతున్నామని తెలిపారు. అదేవిధంగా సీతంపేట రవికిల బంద చెరువుకి ఆనుకొని సుమారు 100 ఎకరాల పంట భూములకు వెళ్లే కాలువ పిచ్చి మొక్కలు బురద నిండిపోయి రైతులు పంట దమ్ములు చేసుకోవడానికి అసౌకర్యంగా ఉండడంతో రైతులంతా కలిసి వారి సొంత నిధులు వేసుకొని కాలువను బాగు చేసుకున్న పరిస్థితి ఏర్పడింది అయితే రైతులకు ఉపయోగపడేలా పనులు చేయాలని జూన్ లోపల చేయాల్సిన పనులు ఇప్పటికీ చేయకపోవడం అధికారయంత్రం లోపమన్నారు. కాలువ పనులు చేస్తుండగా సవర సుంభరు అనే రైతు పాముకాటుకు గురయ్యాడన్నారు. వర్షకాలం కాలువలో గడ్డితుప్పలతో నిండిపోవడంతో పాములు చేరాయని సకాలంలో పనులు పూర్తిచేయకపోవడం వలనే రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి పనులు పూర్తిచేయాలని కోరారు.సవర నర్రయ్య, బోగేష్, తోటయ్య, బంగారు, సోడంగా వెంకయ్య, చిరంజీవి చుక్కరావు, తదితర రైతులు ఉన్నారు.

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా విజయ్‌చంద్ర నియామకంను స్వాగతిస్తున్న పార్టీ నేతలు

విశాలాంధ్ర-పార్వతీపురం: ఆంధ్రప్రదేశ్ లో త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికలు అధికార, ప్రతిపక్ష పార్టీలకు కత్తిమీద సాము లాంటిదని చెప్పవచ్చు. అధికార పక్షంకంటే ప్రతిపక్షాలు ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా చూస్తున్నాయి.ఇదే సందర్భంలో పార్వతీపురం శాసనసభ నియోజకవర్గ అభ్యర్థి ఎంపికపై గతమూడు నెలలుగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కసరత్తులు చేశారు.దీనిలో భాగంగానే ఇంతవరకు టీడీపీలో నియోజకవర్గ ఇంచార్జిగా వ్యవహరిస్తున్న మాజీఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, గర్భాపు ఉదయభాను, వాడాడ రాము, ఎక్సయిజ్ సీఐ విజయకుమార్ ఇలాంటి పేర్లు వినిపించి వీరిలోఒకరు రానున్న ఎన్నికలలో టీడీపీ తరపున ఎవరైనా ఒకరు పోటీ చేస్తారనే ప్రచారం ఉండేది.కానీ గురువారంరాత్రి రాష్ట్ర టీడీపీ అద్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఒక్కసారిగా యువకుడు, మేధావి, ఆర్థిక బలం, ఖండబలంగలిగిన బోనెల విజయ్ చంద్రను పార్వతీ పురం టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జిగా ఎంపికచేస్తూ నిర్ణయాన్ని ప్రకటించారు.విజయ్ చంద్ర నియోజక వర్గంలోని పెద్దగ్రామమైన నరిసి పురం గ్రామానికి చెందినవాడే కావడంతో పాటు ఎస్సీలో మాదిగ కులానికి చెందిన వాడు.దీంతోపాటు బి.టెక్, ఎం.ఎస్. డబ్ల్యూ. విద్యార్హత కలిగిఉండి , తెలుగుదేశం పార్టీలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగాను, గ్లోబల్ ఇంటెన్షియల్ ఫర్ మాదిగ ఛాంబర్ ఫౌండర్ మెంబర్ గాను, జాయింట్ సెక్రటరీగాను, వివిధ సేవా కార్యక్రమాలు,సేవలు అందిస్తూ కేంద్ర, రాష్ట్ర టీడీపీ నేతలతో సంబంధాలు కలిగిన వ్యక్తిగా పేరు ఉంది. నియోజకవర్గంలోని మూడుమండలాల్లో ఉన్న మాదిగల కుటుంబాలతో కూడా సన్నిహిత సంబంధం ఉంది.ఇదిలా ఉండగా కొత్త ఇంచార్జి బొనేల విజయ్ చంద్రపై పలువురు స్పందిస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయాన్ని మేము ఆమోదం తెలపడం తప్ప దానిపై ఎటువంటి ప్రకటన చేయలేమని తెలిపారు. పార్టీ ఎవరికి టిక్కెట్ ఇచ్చిన అభ్యర్థిగెలుపుకు, ముఖ్య మంత్రిగా చంద్రబాబునాయుడును చేసేందుకు కష్టపడి పనిచేయడమే తమ ముందున్న లక్ష్యమని చెప్పారు. ఒక ఆశా వాహుదు ప్రెస్ మీట్ అని చెప్పి చివరి నిమిషంలో వాయిదా వేసుకున్నారు. బలిజపేటమండలానికి చెందిన ఒక ఆశా వాహూదు పార్టీకోసం కష్టపడి పనిచేసే వారికి తప్పించి ఎన్ ఆర్ ఐ లకు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. దీనిప్రభావం ఎన్నికల్లో కనిపిస్తుందన్నారు. మూడు మండలాల, పట్టణపార్టీఅధ్యక్షులు మాత్రం పార్టీ అధిష్ఠాన నిర్ణయం శిరోదార్యమని చెప్పడం గమనార్హం. పార్టీకోసం కష్టపడి పనిచేయడం తప్ప పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించలేమని వారిమాటల్లో తెలిసింది. ఏదిఏమైనా పార్వతీపురం టీడీపీ శాసనసభ నియోజకవర్గ ఇంఛార్జి మార్పు ఇటు ప్రతిపక్షంలోను, అటు అధికారపక్షంలో ఒక్కసారి అలజడి మొదలైంది. గత రెండు రోజులుగా ఎక్కడ విన్న బొబ్బిలి చిరంజీవులు మార్పు గూర్చే చర్చలు జరుగుతున్నాయి. మంచివ్యక్తిని మార్చారని కొంతమంది అంటే, ఇప్పుడున్న పరిస్థితుల్లో అధికార పార్టీకీ దీటైన ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేయాలంటే అభ్యర్థి మార్పు తప్పని సరి కనుక విజయ్ చంద్ర నియామకంను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా నియమించిన ఇంచార్జి విజయ్ చంద్ర మాత్రం నియోజకవర్గంలో అందరికీ కొత్తవాడుకావడం గమనార్హం.శనివారం నుండి నియోజక వర్గంలో ముమ్మర పర్యటనలు చేస్తూ అందరినీ సమన్వయము చేస్తూ పార్టీఆదేశాలు మేరకు నడుచుకుంటానని కొత్తగా నియమించబడిన ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర విశాలాంధ్రకు తెలిపారు.నియోజక వర్గనాయకులను, మండల,గ్రామపార్టీ నాయకులను, కార్యకర్తలను కలసి పార్టీ గెలుపుకు కష్టపడి పనిచేస్తానని చెప్పారు.

విద్యారంగ అభివృద్ధి కై జరగబోయే విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-చీపురుపల్లి: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లావ్యాప్తంగా నిర్వహించబోతున్న విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర పోస్టర్ను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు వంశీ మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ అభివృద్ధి ధ్యేయంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టల్స్ ని అదే విధంగా ప్రభుత్వ విద్యాలయాలని సందర్శిస్తూ 400 కిలోమీటర్ల విద్యార్థి సంగ్రామ యాత్ర ఈనెల 31న కొత్తవలసలో మొదలవబోతుందని తెలిపారు. ఈ యాత్ర కొత్తవలసలో బయలుదేరి జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులను కలుస్తూ ఆగస్టు 9వ తారీఖున జిల్లా కేంద్రంలో యాత్ర ముగుస్తుందని తెలిపారు. జిల్లాలో పేరుకు పోయిన విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఇదే సందర్భంలో ఎస్ఎఫ్ఐ బృందం విద్యార్థులందరిని కలుస్తూ వారి సమస్యలను యాత్ర ముగింపులో జిల్లా విద్యాశాఖ అధికారులకు అందజేస్తుందని ఈ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా జరిగే ఈ 400 కిలోమీటర్ల విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్రను జిల్లాలో ఉన్న ప్రజానీకం , విద్యార్థి లోకం , మేధావులు , యువజనులు జయప్రదం చేయాలని కోరారు. జిల్లాలో సంక్షేమ హాస్టల్స్ పరిస్థితి దీనావస్థలోకి చేరుకుందని , అదే సందర్భంలో ప్రభుత్వ పాఠశాలలో , ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందుకు అతీతం కాదని విమర్శించారు. యాత్ర ప్రారంభమయ్యే లోపు అధికారులు తక్షణమే ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపాలని లేనిపక్షంలో యాత్ర ముగిసిన తర్వాత విద్యార్థులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని దానికి జిల్లా విద్యాశాఖ యంత్రాంగం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సాయి కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు .

ఏపీ ఎన్జీవో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: ఏపీఎన్జీవో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయ వంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జె మురళీ పిలుపు నిచ్చారు. నెల్లిమర్లలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విజవాడ ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియంలో ఆగస్టు 21,22 తేదిలలో నిర్వహించనున్న ఈ సమావేశాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు చెప్పారు. నెల్లిమర్ల తాలూక యూనియన్ నుంచి సమావేశానికి అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు. సమావేశంలో తాలూకా యూనిట్ అధ్యక్షులు ఎ గణేష్, కార్యదర్శి వై రమణ జిల్లా కోశాధికారి ఎస్ వి. సుధాకర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ వై.ఆనంద్ కుమార్ జిల్లా జాయింట్ కార్యదర్శి మూర్తి, కోశాధికారి ధనుంజయ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు విద్యాబోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర-భోగాపురం : ఉపాధ్యాయులు విద్యాబోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తద్వారా విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని ఆర్ జె డి.జ్యోతికుమారి అన్నారు. భోగాపురం ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని శుక్రవారం సందర్శించారు. ఆహార నాణ్యత గురించి, స్టడీ అవర్స్ గురించి అడిగి తెలుసుకున్నారు, నోట్ పుస్తకాలు సరిచేశారా లేదా అని పరిశీలించారు, ప్రస్తుతం శరవేగంగా విస్తరిస్తున్న కండ్లకలకకు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి బాలికలకు వివరించారు. ఎఫ్ ఏ 1 పరీక్షలకు సన్నద్ధంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. వసతి గృహంలో ఈగల నివారణకు చర్యలు తీసుకోని వాటిని నివారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయిని పార్వతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు నిష్పక్షపాతంగా అందించటానికే సురక్ష : ఎంపీపీ

విశాలాంధ్ర-వంగర : ప్రజలకు సంక్షేమ పథకాలు అందించటంలో మధ్యవర్తులు, దళారులు ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలందరికీ అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిదే నని ఎంపీపీ వి.సురేష్ ముఖర్జీ అన్నారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా నేరుగా ప్రభుత్వ పథకాలు నగదు తమ ఖాతాలలోకే పడుతున్నాయని మహిళలు ప్రభుత్వ పాలన పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.సీఎం జగన్ మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా,కులం మతం,పార్టీలు చూడకుండా అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ప్రతి కుటుంబానికి రూ. లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి కలుగుతోందని, ఈ సంక్షేమ పథకాలు మరింత మెరుగ్గా అమలు జరగాలంటే మళ్ళీ జగన్ మోహన్ రెడ్డిని సీఎం గా చేయటానికి సహకరించాలని ఆయన ప్రజలను కోరారు. జగన్ అందిస్తున్న సుపరిపాలన ఎంతగానో ప్రజాభిమానాన్ని పొందిందన్నారు. జగన్ మోహన్ రెడ్డిని అధికార పీఠంపై నిలిపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అర్హులకునీస్పక్షపతంగా ప్రభుత్వపథకాలు అందించటానికే సురక్ష కార్యక్రమం ఏర్పాటుచేసిందినీ సురేష్ ముఖర్జీఅన్నారు. కార్యక్రమంలో వంగర సర్పంచ్ కే. భారతీ,ఎంపీటీసీ కే.పద్మ,కొప్పర ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ముగిసిన జగనన్న సురక్ష

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: మున్సిపాలిటీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ముగిసింది. శుక్రవారం పట్టణంలోని ఎనిమిది తొమ్మిది సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15 16 17 18 వార్డులకు సంబంధించిన అర్జీదారులకు 11 రకాల అధికారిక ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే అలజంగి జోగారావు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూరాష్ట్ర ముఖ్యమంత్రి ఏఒక్కరు, ఏ కుటుంబమూ కూడా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు దూరం కాకూడదు అన్న ఏకైక లక్ష్యంతో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయాలనే ఉద్దేశంతో ప్రజలకు ఎంతో ఉపయోగ కరమైన ప్రభుత్వ అధికారిక ధృవీకరణ పత్రాలను కేవలం వారం రోజుల వ్యవధిలోపలనే ప్రజల ముంగిటకే అధికార యంత్రాంగం వచ్చి ఉచితంగా అందచేసే గొప్ప కార్యక్రమం అని, ప్రజల యొక్క ప్రతీ అవసరాన్ని గుర్తించి పరిష్కరించే బాధ్యతాయుత ప్రభుత్వం మనదని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బి గౌరీశ్వరి, వైస్ చైర్మన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ యిందుపూరు గున్నేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వానపల్లి శంకరరావు, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ కౌన్సిల్, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు,గృహ సారథులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

లబ్ధిదారులకు హౌసింగ్ ఎఇ వెంకటరావు సూచన

విశాలాంధ్ర-జామి: గృహ నిర్మాణాలను చేపట్టి మధ్యలోనే ఆపేసిన లబ్ధిదారులంతా నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ ఎఇ చలుమూరి వెంకటరావు సూచించారు. శుక్రవారం జామిలోని దొండపర్తి జంక్షన్ ఉన్న జగనన్న లే అవుట్లో హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ బిల్లు ప్రభుత్వం త్వరగా చెల్లిస్తున్నందున ఇళ్ళు నిర్మాణాలు వేగవంతం చేయాలని కోరారు. లబ్దిదారులకు సిమెంట్, ఇసుక సరఫరా చేస్తున్నామని తెలిపారు. అనుకున్న లక్ష్యం మేరకు గృహ నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ బి. మౌనిక, వర్క్ ఇన్స్పెక్టర్ సత్యరావు పాల్గొన్నారు.

పరిసరాల్లో దోమల ఆవాసాల నియంత్రణ ద్వారా కాలానుగుణ వ్యాధుల నివారణ

విశాలాంధ్ర-బెలగాం : పరిసరాల్లో దోమల ఆవాసాల నియంత్రణ చర్యలు చేపట్టడం ద్వారా కాలానుగుణ వ్యాధులను నివారించవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన పార్వతీపురం మండలం బాలగుడబ గ్రామంలో వైద్య సిబ్బంది నిర్వహించిన డ్రైడే కార్యక్రమాలను పరిశీలించారు. ఇంటి ఆవాసాల్లో ఉపయోగంలో లేని కుండీలు, పాడైన వస్తువుల్లో ఉన్న నీటి నిల్వల తొలగింపును పరిశీలించారు. అనంతరం స్థానికులతో డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ ఈ విధంగా ఇంటి పరిసరాల్లో దోమల ఆవాసాలున్న నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని, ముఖ్యంగా వర్షాకాలం కావడం వల్ల పరిసరాల్లో మరింత నీరు చేరి నిల్వ ఉండటం వల్ల అవి దోమలు పుట్టడానికి ఆవాసాలుగా మారతాయని తద్వారా మలేరియా, డెంగ్యూ మొదలగు సీజనల్ వ్యాధులు ప్రభలు తాయన్నారు. కాబట్టి ముందస్తు చర్యలు, జాగ్రతలు తప్పనిసరని అన్నారు. వీటిలో ముఖ్యంగా ఇంటి ముందు కాలువల్లో చెత్త వేయరాదని, ఇంటి పరిసరాల్లో పనికిరాని పడేసిన తొట్లు, డబ్బాలు, టైర్లు, కొబ్బరి చిప్పలు తొలగించాలని, పిచ్చి మొక్కలు, కంప చెట్లను, గుర్రపు డెక్కలు ఇంటి పరిసరాల్లో లేకుండా తొలగించుకోవాలని, వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమాలకు సహకరిస్తూ భాగస్వాములు కావాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి.శ్రీకాంత్, సూపర్ వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది జగదీష్, రామలక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వర్షాలు, వరద బాధితులకు ఉదారంగా సహాయం

వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి

విశాలాంధ్ర-విజయనగరం : రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఇబ్బందులకు గురవుతున్న ప్రజానీకానికి మానవతా దృక్పథంతో ఉదారంగా సహాయం అందించాలని ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు వరదలవల్ల ఉత్పన్నమైన పరిస్థితులపై సిఎం. శుక్రవారం జిల్లా కలెక్టర్ లు, ఎస్.పి.లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి మంచి ప్రమాణాలతో కూడిన ఆహారాన్ని, వసతులను కల్పించాలని కోరారు. పునరావాస కేంద్రాల నుంచి తిరిగి ఇంటికి వెళ్లే వారికి ఒక్కో కుటుంబానికి రూ.2000 నగదు సహాయం అందించాలని సూచించారు. పూరి గుడిసెలు దెబ్బతిన్నప్పుడు ఆయా కుటుంబాలకు పూర్తిస్థాయి సహాయంగా రూ.10 వేలు అందించాలని ఆదేశించారు.సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, ఎస్.పి. దీపిక, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్.డి.ఓ సూర్య కళ, సి.పి.ఓ. పి.బాలాజీ, డి.ఎం.హెచ్.ఓ. డా. భాస్కరరావు, జిల్లా వ్యవసాయ అధికారి వి.టి. రామారావు, ప్రకృతి విపత్తుల నిర్వహణ జిల్లా మేనేజర్ బి.ఎస్. దొర, ఉద్యానశాఖ డి.డి. జమదగ్ని, పంచాయతీ రాజ్ ఎస్.ఈ.గుప్తా, గ్రామీణనీటి సరఫరా ఎస్.ఇ. ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు రిటైర్డ్‌మెంట్ వయస్సు లేకుండా జీఓ జారీ హర్షణీయం

విశాలాంధ్ర-నెల్లిమర్ల: అర్చకులకు రిటైర్డ్‌మెంట్ లేకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జీఓ జారీ చేయడం హర్షనీయమని అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షులు ఖండవిల్లి సాయిరాం ఆచార్యులు చెప్పారు. రామతీర్థం దేవస్థానంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల హామీలలో భాగంగా ఏడాదికి రూ.5 లక్షలు ఆదాయం వస్తున్న ఆలయాలలో పనిచేస్తున్న అర్చకులకు ఉద్యోగ విరమణ లేకుండా ముఖ్య మంత్రి సుప్రీం కోర్టు తీర్పును అనుసరిస్తూ జీఓ విడుదల చేశారని చెప్పారు. అలాగే జీఓ ప్రకారం గృహనిర్మాణాలకు నిధులు, వివాహాలకోసం ఆర్థిక సాయం అందనుందని చెప్పారు. భూములు ఉన్న అర్చకులకు రైతుభరోసా అవకాశం కల్పించినట్లు చెప్పారు.

వెంకటపురంలో జగనన్న సురక్ష కార్యక్రమం

విశాలాంధ్ర-సీతానగరం: అన్ని వర్గాల కుటుంబ సభ్యుల అవసరాలను గుర్తించి వారికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మేలు చేకూర్చడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఎంపిడిఓ ఎం ఎల్ ఎస్ ప్రసాద్ తెలిపారు.శుక్రవారం వెంకటపురం గ్రామసచివాలయంలోజరిగిన జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమం జరిగింది. జగనన్న సురక్ష క్యాంప్ ద్వారా అర్జీ పెట్టుకున్న అర్హులకు మంజూరు కాబడిన 11రకాల సేవలకు చెందిన ధృవీకరణ పత్రాలను ఎంపిపి, జెడ్పీటీసీ, పార్టీ అధ్యక్షుడు, సర్పంచులచే ఆర్జీదారులకు అందజేసారు. కులధృవీకరణ, ఆదాయ, జనన, కుటుంబ, మరణ ధృవీకరణ, కొత్త రైస్‌కార్డులు, వివాహ ధృవీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జగనన్న సురక్ష కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశంను ప్రజలకు ఎంపిడిఓ ఎంఎల్ఎస్ ప్రసాదు, ఈఓపిఆర్డీలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మామిడి బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బలగ శ్రీరాములు నాయుడు, పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, సర్పంచులు బుడితి శ్రీనివాసరావు, వాకాడ పారమ్మ, ఎంపిటిసి గుల్ల సంతోషికుమారి, ఆర్ఐ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ జానకీ రాం, వెలుగు ఏపిఎం శ్రీరాములు, ఉపాధి ఏపిఓ భాను,నాయకులు దాసరి నాగరత్నం,బుడితి గౌరునాయుడు, ఏగిరెడ్డి గోపాలనాయుడు,ముకుంద, కె.లలిత, సెక్రటరీలు వెంకటలక్ష్మీ, పీటర్, విఆర్ఓ సుబ్రమణ్యం, సచివాలయం ఉద్యోగులు, అంగన్వాడి సిబ్బంది, వైద్య సిబ్బంది, నాలుగు పంచాయతీల వాలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

మంత్రి జోగి రమేష్ వ్యాఖ్యలను ఖండించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంపకృష్ణ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మంత్రి జోగి రమేష్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ ఖండించారు. శృంగవరపుకోట టీడీపీ పార్టీ కార్యలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రిష్ణ మాట్లాడుతూ గుంటూరు జిల్లా వెంకటపాలెంలో జరిగిన ఇళ్ల నిర్మాణ పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్. చంద్రబాబునాయుడు, లోకేశ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇలాంటి వ్యాఖ్యలు తగవని హెచ్చరించారు. 14 ఏళ్ళు ముఖ్యమంత్రి పదవిలో ఉన్న చంద్రబాబునాయుడుని విమర్శించే అర్హత మంత్రి జోగి రమేష్ కు లేదన్నారు. బహిరంగ సభలో చంద్రబాబుపై జోగి రమేశ్ అసభ్యకర విమర్శలు చేస్తుంటే అడ్డుకోవాల్సిన సీఎం వైఎస్ జగన్ సమర్థించేలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ సొమ్ములు పంచే సభల్లో బూతులు మాట్లాడటం ఏమిటని క్రిష్ణ మండిపడ్డారు. కార్యక్రమంలో లగుడు రవికుమార్ (జామి టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు), రాయవరపు చంద్రశేఖర్ (విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు), జుత్తాడ రామసత్యం (మండల పార్టీ సెక్రటరీ), మాదిబోయిన మంగరాజు గారు (ఎస్.కోట టౌన్ టీడీపీ పార్టీ ఉపాధ్యక్షులు), ఇందుకూరి శ్రీనిరాజు, సన్యాసినాయుడు (సిరిపాలెం), ముక్క రామకృష్ణ (వేపాడ తెలుగు యువత అధ్యక్షుడు), కిలపర్తి హరి (ఎస్.కోట ఐటీడీపీ అధ్యక్షుడు) పాల్గొన్నారు.

టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఇంచార్జ్ భరత్ జన్మదిన వేడుకలకు భారీ ఏర్పాట్లు

తెలుగుదేశం పార్టీ విశాఖపట్నం పార్లమెంటరీ ఇంచార్జ్ ఎం.భరత్ జన్మదిన వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, యువనేత గొంప క్రిష్ణ తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రిష్ణ మాట్లాడుతూ శనివారం భరత్ పుట్టినరోజు సందర్భంగా కొత్తవలసలోని గౌరపల్లి రాము కార్యాలయంలో గొంపకృష్ణ ఆధ్వర్యంలో భరత్ పుట్టినరోజు వేడుకలు ఘనంగ జరపనున్నారన్నారు. అనంతరం కొత్తవలస నుండి విశాఖ వెళ్లి అక్కడ భరత్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తామన్నారు. కొత్తవలస తిరిగి వచ్చి శనివారం మధ్యాహ్నం 12 గంటలకి కొత్తవలసలో గల శ్రీ చైతన్య మానసిక వికలాంగుల పాఠశాలలో పిల్లలందరికి కూడా మధ్యాహ్న భోజనాలు, అలాగే బలిఘట్టం దగ్గర ఉన్న న్యూహెూప్ పాఠశాలలో పిల్లలకు భోజనాలు పెడతామన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు రాయవరపు చంద్రశేఖర్, లగుడు రవికుమార్, గౌరపల్లి రాము, జుత్తాడ రామసత్యం, ఎం.మంగరాజు, ఐటీడీపీ నేత హరి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష లో ప్రోటోకాల్ ను విస్మరించిన అధికారులు

విశాలాంధ్ర-మెంటాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమము నిర్వహిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందనీ వారికి అందే విధముగా కృషి చేస్తూ 11 రకాల ఉచిత సేవలు తక్షణమే పొందే విధముగా ప్రభుత్వం రూపొందించిన జగనన్న సురక్ష కార్యక్రమాలు ప్రతి సచివాలయ పరిధిలో నిర్వహిస్తుండగా శుక్రవారం పెదమేడపల్లి గ్రామ సచివాలయ ప్రాంగణంలో నిర్వహించిన జగనన్న సురక్షిత కార్యక్రమంలో మండల అధికారులు ఎంపీడీవో మరియు గ్రామ సచివాలయ కార్యదర్శి ప్రోటోకాల్ ను విస్మరించారని ఎంపీటీసీ రెడ్డి ఎర్రి నాయుడు అన్నారు. రాజకీయాలకు అతీతంగా కుల మతాలకు సంబంధం లేకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందేలా రూపొందించిన ఈ కార్యక్రమంలో లోకల్ ఎంపీటీసీ నీ ఆహ్వానించకపోవడం కనీసం విషయం తెలియజేయకపోవడం రాజకీయ దురుద్దేశాన్ని తలపిస్తుందని ప్రభుత్వ అధికారులు ఈ విధంగా ప్రవర్తించడం నన్ను అవమానించడమేనని ఆయన పేర్కొన్నారు. వారికి చిత్తశుద్ధి ఉంటే నిజముగా రాజకీయ పార్టీలను చూడకుండా ప్రోటోకాల్ పాటించేవారని గ్రామంలో ఎంపీటీసీ అయిన నాకు జరిగిన అవమానాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ కు గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు చేయదలచుకున్నానని ఆయన తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాక ఉండేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కారంపై అధికారులు చొరవచూపాలి : ఎమ్మెల్సీ రఘురాజు

విశాలాంధ్ర-వేపాడ: అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మండల కేంద్రం వేపాడ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ అధ్యక్షుడు దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హాజరయ్యారు. ముందుగా గత సమావేశంలోని సమస్యలను చదివి వినిపించగా అందులో కొన్ని సమస్యలు పరిష్కారం కాక పోవడంతో సభ్యులు అడిగిన సమస్యలను పరిష్కార దిశగా పనిచేయాలని అధికారులను ఎమ్మెల్సీ ఆదేశించారు.మండలంలోని అరిగి పాలెం గ్రామంలో స్మశాన వాటిక ప్రహరీ కూడా అసంపూర్తిగా ఉందని సభ దృష్టికి సర్పంచ్ తెలియజేయగా ఎస్ట్ మేట్ వేయవలసిందిగా సంబంధిత అధికారికి ఆదేశించారు. ముకుందపురం సర్పంచ్ నాగిరెడ్డి కనకరాజు గ్రామంలో ఇల్లపై నుండి హై టెన్షన్ విద్యుత్ వైర్లు ఉండడంతో ప్రజల ఇబ్బంది పడుతున్నారన్నారు. బానాది గ్రామ సర్పంచ్ కర్రీ యశోద గ్రామంలో విద్యుత్ పోల్స్ వాలి ప్రమాదకరంగా ఉన్నాయన్నారు.వెంటనే ఎమ్మెల్సీ సమస్యను పరిష్కరించాలని ఎలక్ట్రికల్ ఏఈకి ఆదేశించారు. మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు సింగరాయ గ్రామ సర్పంచ్ నిరుజోగి వెంకటరావు గతంలో ఎస్టిమేట్లు వేసిన సిసి రోడ్లు వర్కులు అమలులో ఉన్నాయా రుద్దుపరిచారా అని అడగ్గా వర్కులు చేసుకోవచ్చని సంబంధిత అధికారి తెలిపారు. జడ్పీటిసి సభ్యుడు సేనాపతి అప్పారావు ఇళ్ల నిర్మాణా లబ్ధిదారులకు ఉపాధి హామీ నుండి వచ్చే బిల్లులు అందడం లేదని ఏపీఓని అడగ్గా బిల్లులు మంజూరయ్యేలా చూస్తామని బదులిచ్చారు. వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు రైతులకు వరి విత్తనాల పంపిణీ విషయమై ఏఓని అడగ్గా సరైన సమాధానం చెప్పకపోవడంతో కల గజేసుకున్న ఎమ్మెల్సీ గౌరవ సభ్యులు అడిగేట ప్పుడు సరైన సమాధానం చెప్పాలని ఆగ్రహించారు.అదేవిధంగా మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ సన్యాసి నాయుడు ఓకే సచివాలయంలో రెండేసి రైతు సంఘాల గ్రూపుల ఏర్పాటు చేసి సబ్జీడి పై యంత్రాలను అందించేటప్పుడు మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్గా నాకు తెలియజేయవలసిన బాధ్యత మీకు లేదా అని ఏఓ సి.బి యశ్వంతరావుపై విరుచుకుపడ్డారు.ఈ విషయమై ఏఓ ఇకపై అలా జరగదని ఒప్పుకున్నారు. ఇంకా మండలంలోని పలు గ్రామాల సర్పంచ్లు ఎంపీటీసీలు పలు సమస్యలను లేవనెత్తుగా పరిష్కార దిశగా పనిచేస్తామని అధికారులు బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి లక్ష్మీ నారాయణ,,ఎంపీడీఓ సాయికుమార్ నాథ్ పట్నాయక్, తహసీల్దార్ కె ప్రసన్నకుమార్, మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం

విశాలాంధ్ర-విజయనగరం : ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాల్లో చేపట్టిన ఇంటింటి సర్వే నెమ్మదిగా జరుగుతుండటం పట్ల కలెక్టర్ నాగలక్ష్మి తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మందకొడిగా జరుగుతున్న మండలాల అధికారులపై మండిపడ్డారు. పనితీరు మార్చుకొని, వేగవంతం చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డిఓలు, తాశిల్దార్లు, ఎన్నికల డిటిలతో కలెక్టర్ సమీక్షించారు. నియోజకవర్గాల వారీగా, మండలాల వారీగా చేపట్టిన జాబితాల సవరణ ప్రక్రియను తెలుసుకున్నారు. ఇంటింటి సర్వే ప్రారంభమై దాదాపు వారం రోజులు కావస్తున్నా, కనీసం పదిశాతం కూడా పూర్తి కాలేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లాలో సుమారు 5,17,000 ఇళ్లు ఉండగా, ఇప్పటివరకు కేవలం 38,000 ఇళ్ల సర్వే మాత్రమే పూర్తి చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అయితే శతశాతం ఎప్పుడు పూర్తి అవుతుందని ప్రశ్నించారు. వచ్చే వారం చివరికి 50 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్త ఓటర్లు, జనవరి 2024 నాటికి ఓటుహక్కు పొందే కాబోయే ఓటర్ల వివరాలు కూడా చాలా తక్కువ సేకరించారని అన్నారు. డెత్ ఓటర్స్ వెరిఫేషన్, వందేళ్ళు పైబడిన ఓటర్ల వివరాల తనిఖీ కూడా అంతంత మాత్రంగా ఉందన్నారు. సర్వేలో 6,7,8 ఫారాల స్వీకరణ పట్లా అసంతృప్తిని వ్యక్తం చేశారు. పనితీరు మారాలని, నిర్లిప్తతను విడనాడాలని సూచించారు. సవరణ ప్రక్రియపై తాశిల్దార్లు, ఆర్డిఓలు ప్రతిరోజూ బిఎల్ఓలతో సమీక్ష చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఓ ఎం.గణపతిరావు, ఇఆర్ఓలు, ఎఇఆర్ఓలు, జిల్లా ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

కెజిబివి పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా జడ్జి

విశాలాంధ్ర-జామి: మండలంలోని కుమరాంలో ఉన్న కస్తూరిభాగాంధీ బాలికా విద్యాలయంను జిల్లా సివిల్ జడ్జి కె.నాగమణి శుక్రవారం తనిఖీ చేసారు. ముందుగా తరగతి గదులను, గదులలో సదుపాయాలను పరిశీలన చేసారు. అనంతరం విద్యార్థులకు చేసిన వంటలను రుచి చూసారు. అలాగే వసతి సదుపాయాల పైనా, వంట సరకుల నిల్వలను పరిశీలన చేసి సంతృప్తి వ్యక్తం వ్యక్తం చేసారు. పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి విద్యార్థులకు అందుతున్న సేవలను వివరించారు. ఈపరిశీలనలో జిల్లా న్యాయమూర్తి వెంట జామి ఇన్‌చార్జి ఎస్ఐ రాజేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

హైపటైటిస్ వ్యాధిపై అవగాహన సదస్సులు

విశాలాంధ్ర-జామి: వరల్డ్ హెపటైటిస్ డే సందర్భంగా శుక్రవారం మండలంలోని అలమండ పీహెచ్సి పరిధి ఉన్న అలమండ, మొకాసా కొత్తవలసలో హెపటైటిస్‌వ్యాధిపై వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సులను నిర్వహించారు. అలమండ వైద్యాధికారిణి కెవిఎస్. పద్మావతి వ్యాధి లక్షణాలను, సోకే విదానం, నివారణా చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెపటైటిస్ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్ఎల్ హెచ్‌పిలు, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకూ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే అప్పల నరసయ్య

విశాలాంధ్ర-దత్తిరాజేరు: రాజులరామచంద్ర పురం సచివాలయ పరిధిలో గల ఎస్ చింతల వలస గ్రామంలో శుక్రవారం గజపతినగరం శాసనసభ్యులు బొత్స అప్పలనరసయ్య గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకుని తక్షణమే సమస్యలు పరిష్కారం చేస్తున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పింఛన్లు, రైతు భరోసా, విద్యా దీవెన, అమ్మ ఒడి, ఆసరా, చేయూత, చేదోడు, వసతి దీవెన అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జడ్పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు, టీసీ సెల్ అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కడుబండి రమేష్ నాయుడు, తహసిల్దార్ గురుమూర్తి, స్థానిక సర్పంచ్, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల పోరుయాత్ర, రాష్ట్ర జాత జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-బెలగాం: హింసపై మహిళల పోరు యాత్ర రాష్ట్ర జాత జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కరపత్రంను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మద్యం మత్తు పదార్థాలు నియంత్రిస్తానని ఎన్నికలు ముందు హామీ ఇచ్చిందని అది నెరవేకపోగా మద్యంను ఆదాయవనరుగా ప్రభుత్వం చూస్తుందని అన్నారు. దేశంలో, రాష్ట్రంలోనూ హింస రోజురోజుకు పెరుగుతుందని ఢిల్లీలో మహిళా మల్లయోధులు చేసిన ఆందోళన ఇందుకు నిదర్శనమని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల హింసను అరికట్టేం తవరకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మహిళల పోరుయాత్ర చేపడుతుందని, పార్వతీపురం మన్యం జిల్లాలో ఈనెల 29 మధ్యాహ్నం పాల కొండలో, సాయంత్రం పార్వతీపురం, సీతా నగరం, సాలూరులలో రాష్ట్ర జాత వస్తుందని అన్నారు. మహిళలు, అభ్యుదయ వాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాణ్యం గౌరి, బి. జయలక్ష్మి వి. ఇందిర. జి. తులసి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

విశాలాంధ్ర-బెలగాం : విద్యుత్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు డైరెక్ట్ పేమెంట్ చేయాలని సమానపనికి సమాన వేతనం అందజేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న డిఎ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. అపాయింట్మెంట్ బైట్రాన్స్ ఫర్ కింద కేడర్లలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాలికల వసతి గృహంలో రూ.7.75 లక్షల పనులకు ఎమ్మెల్సీ శంఖుస్థాపన

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట మండల కేంద్రములోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహంలో రూ.7.75లక్షల పనులకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శంఖుస్థాపన పూజలు చేశారు. ఈ సందర్భముగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ బాలికల వసతి గృహానికి జిల్లా పరిషత్ సాధారణ నిధుల నుండి స్నానపుగదుల నిర్మాణానికి రూ.3.75 లక్షలు, టాయిలెట్ల నిర్మాణానికి 4.00 లక్షల రూపాయలు మొత్తం రూ.7.75లక్షల విలువగల పనులకు శంఖుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ గిరిజన సంక్షేమ పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహములోని బాలికలతోను, స్థానికులతోనూ వసతి గృహములోని పరిస్థితుల గురించి ఎమ్మెల్సీ ఆరా తీసారు. బాలికలు ఉండే డార్మెటరీ, తరగతి గదులను, విద్యార్థులకు భోజనాలను

వండే వంటగదిని పరిశీలించారు. హాస్టల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలన్నారు. వసతి గృహాల్లోని విద్యార్థులు అనారోగ్యానికి గురైతే తక్షణమే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించాలన్నారు. వసతిగృహంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని, విద్యార్థులకు నాణ్యత కలిగిన ఆహారాన్ని అందించాలని వసతిగృహ సంక్షేమా ధికారిణిని ఆదేశించారు. ముఖ్యంగా విద్యార్థుల్లో రక్తహీనత లోపాల వల్ల ఎక్కువగా అనారోగాల బారినపడే అవకాశాలు ఉన్నాయని, కావున ఎప్పటి కప్పుడు వైద్య తనిఖీలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు కొన్ని విషయాలు చెప్పేందుకు భయపడతారని, అలాంటి పరిస్థితి రాకుండా ఎప్పటికప్పుడు విద్యా ర్థులను కనిపెట్టుకొని వారి ఆరోగ్య క్షేమం వివరాలు అడిగి తెలుసు కోవాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వసతిగృహ పరిసరాలు మరియు విద్యార్థినుల ఆరోగ్యం పట్ల అత్యంత జాగ్రత్త వహించాలని ఎమ్మెల్సీ రఘురాజు సూచించారు. ఈ కార్యక్రమ ములో ఎం.పి.పి సంది సోమేశ్వం రావు, జెడ్పిటిసి ఎమ్.వెంకటలక్ష్మి, ఎస్.కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సంతోషి కుమారి, ఎం.పి.టి.సి రాకోటి దారగిరి, నాయకులు మోపాడ శ్రీను, గంగరాజు, సూరి అప్పారావు, ప్రసాద్, అరున్, రమేష్, మండల ఇంజనీరింగ్ అధికారి సత్యనారాయణ, సిబ్బంది, వసతిగృహ సంక్షేమాధికారిణ పాల్గొన్నారు.

అర్హులందరికీ న్యాయం చేసేందుకే జగనన్న సురక్ష

తహశీల్దార్ ఆర్. రమేష్ కుమార్

విశాలాంధ్ర - కురుపాం : రాష్ట్రంలో ఇంకా సంక్షేమ పథకాలు కు దూరంగా మిగిలిన అర్హులందరికీ న్యాయం చేయడానికి జగనన్న సురక్ష ప్రారంభించారనీ తహశీల్దార్ ఆర్. రమేష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలో మొండెంఖల్ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ప్రభుత్వ సేవలు పేదల ఇంటి వద్దకే తీసుకొచ్చారని అన్నారు. అనంతరం అర్హులైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, మండల పరిషత్ ఏవో లక్ష్మం నాయుడు, వైస్ ఎంపీపీ రంగారావు, ఎంపీటీసీ జి విద్యా రాణి, మాజీ ఎంపీపీ అనిమా ఇందిరా కుమారి, పంచాయతీ కార్యదర్శి వై. వెంకట నాయుడు, వైసీపీ నాయకులు ఐ.రామకృష్ణ, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

ఇ జిల్లా మేనేజర్ పోస్టు పరీక్షకుకు 10 మంది హాజరు

విశాలాంధ్ర - బెలగాం : ఎలక్ట్రానిక్ జిల్లా మేనేజర్ ఉద్యోగానికి ఔట్సోర్సింగ్ పద్ధతిలో నియామకానికి వ్రాత పరీక్ష నిర్వహించినట్లు డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేటిక్స్ అధికారి ఎ. సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వ్రాత పరీక్షకు 10 మంది హాజరయ్యారు. మొత్తం 20 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలో ప్రతిభ చూపిన వారికి నియామక ఉత్తర్వులు జారీ చేస్తామని, నెలకు 22,500 రూపాయల వేతనం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి ఆర్. ఉమామహేశ్వరరావు పరీక్ష నిర్వహణ పర్యవేక్షించారు.

వర్షాలు, వరదలు పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - పార్వతీపురం : వరదలపై రాష్ట్ర ముఖ్య మంత్రి శుక్రవారం జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు, వరదలు పట్ల అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి

ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకటరావు, జిల్లా ప్రధాన అగ్నిమాపక అధికారి కె. శ్రీనుబాబు, జిల్లా ఉద్యానశాఖ అధికారి కెఎస్ఎన్ రెడ్డి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు వెంకటేష్, జలవనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారి ఆర్. అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2023 - 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ మూడవ స్పెల్, లాస్ట్ స్పెల్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు, ఆగస్టు నెల 17వ తేదీ చివరి తేదీ అని కళాశాల ప్రిన్సిపల్ జంజేటి రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో ఎంపిసి, బైపిసి, సీఈసీ, హెచ్ఈసీ, వృత్తి విద్యా కోర్సులు తెలుగు మీడియం మరియు ఇంగ్లీష్ మీడియం కోర్సులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. అంతే కాకుండా విద్యార్థులకు విశాలమైన తరగతి గదులు, అన్ని తరగతి గదులలో ఫర్నిచర్, ఆర్ఓ ప్లాంట్ తాగునీరు, సువిశాలమైన క్రీడామైదానం, సీనియర్ అధ్యాపకులచే విద్యాబోధన, వెనుకబడిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. నాడు నేడు పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని, 50 గ్రీన్ చాక్ బోర్డులు, జిబ బాత్ రూమ్ డోర్స్, డ్యూయల్ డెస్క్ లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కావున పదవ తరగతి పాసైన విద్యార్థినీ విద్యార్థులు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తమకు నచ్చిన గ్రూపులో నచ్చిన మీడియంలో చేరవచ్చని అన్నారు.

జూనియర్ కళాశాలల బంద్ విజయవంతం

విశాలాంధ్ర - చీపురుపల్లి : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ చీపురుపల్లి శాఖ ఆధ్వర్యంలో ప్రైవేటు మరియు కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేయడం, అలాగే ప్రభుత్వ కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, వీటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ %ూాదీవూ% ఈ రోజు రాష్ట్ర వ్యాప్త బంద్ కి పిలుపునివ్వడం లో బాగంగా చీపురుపల్లి లో ఉన్నటువంటి అన్ని జూనియర్ కళాశాల బంద్ కి పిలుపునివ్వడం జరిగిందనీ %ూాదీవూ% రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంపత్ పేర్కొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు సీఎం జగన్‌తోనే సాధ్యం

శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - వేపాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి అంటే అది సీఎం జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమని శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సింగరాయి సచివాలయ పరిధిలోని జగ్గయ్యపేట గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు 236వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. పథకాలు అందు తున్నాయా లేదా అని తెలుసుకుంటున్నారు. అలాగే ప్రతి నెల 1వ తారీఖున గ్రామ వాలంటీర్లు వచ్చి పింఛన్లు అందిస్తున్నారా లేదా అని లబ్ధిదారులను అడుగుగా వాలంటీర్లు సక్రమంగా పింఛన్లు అందిస్తున్నారని ఎమ్మెల్యే కు తెలిపారు. ఎవరికైనా ఏదైనా సమస్యతో సంక్షేమ పథకాలు అందనియెడల వెంటనే పరిష్కరించాలని సచివాల సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ముందు చూపుతో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ, అభివృద్ధి, పథకాలు అందిస్తూ ప్రజా రంజకమైన పాలన అందిస్తున్నారని అలాంటి ముఖ్య మంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డిని మరల ముఖ్యమంత్రి చేయవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నెడ్‌క్యాప్ డైరెక్టర్ చలుమూరి పద్మావతి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షుడు మమ్ములూరి జగ్గీ బాబు, ఎంపీటీసీ తొండవరపు వెంకటరమణ, మండల పార్టీ యువజన అధ్యక్షులు ఉగ్గిన శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ వంటాకు రాములమ్మ, ఉపసర్పంచ్ వంటాకు శ్రీను, సచివాలయ కన్వీనర్ దుల్ల సన్యాసిరావు వాలంటీర్లు, పాల్గొన్నారు.

ఎంపీటీసీ అయోధ్య అనారోగ్యంతో మృతి

విశాలాంధ్ర - కురుపాం : మండలం లోని జి.శివడ సెగ్మెంట్ ఎంపీటీసీ మీనక. అయోధ్య అనారోగ్యంతో శుక్రవారం ఉదయం ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఈయన వైసీపీ సీనియర్ నాయకులు రెండుసార్లు సర్పంచ్ గా రెండుసార్లు ఎంపీటీసీగా సుదీర్ఘ అనుభవం కలిగిన రాజకీయ నాయకుడు. ఈయన మృతికి ఎమ్మెల్యే పాముల. పుష్పశ్రీవాణీ, ఎంపీపీ శెట్టి. పద్మావతి ,జడ్పీటీసీ సుజాత ,మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్ ,వైఎస్సార్ కాంగ్రెస్ నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

'బ్రో' సినిమా రిలీజ్ సందర్భంగా పవన్ కళ్యాణ్ అభిమానులు భారీ ఊరేగింపు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : 'బ్రో' సినిమా విడుదలైన సందర్భంగా పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన నాయకులు భారీ ఊరేగింపు కార్యక్రమం శృంగవరపుకోటలోని శ్రీనివాస థియేటర్ నుండి జనసేన పార్టీ కార్యాలయం వరకు నిర్వహించారు. డీజే సౌండ్స్ తో ర్యాలీగా వెళ్లి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి దేవి జంక్షన్ వద్ద పాలాభిషేకం చేసి బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన నాయకులు వబ్బిన సత్యనారాయణ, వబ్బిన సన్యాసినాయుడు, ఎయిర్టెల్ సతీష్, సాయి, కొట్యాడ లోకాభి రామకోటి, గంటా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి రోటరీ క్లబ్ అధ్యక్షులు జేసీ రాజు చేయూత

విశాలాంధ్ర - బొబ్బిలి : మండలం బూర్జ వలస గ్రామానికి చెందిన గాడేల మంగమ్మ క్యాన్సర్ వ్యాధి బాధితురాలికి బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు జేసి రాజు చేయూత అందించారు. బొబ్బిలి రోరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు చిన్న కుమారుడు జెసి ఎస్ రాయ్ వర్థంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని శుక్రవారం బూర్జవలసలో క్యాన్సర్ వ్యాధి బాధితులు మంగమ్మ గృహం వద్ద ఆమె కుమారునికి అందించారు. ఆమె గత కొంత కాలం నుండి గర్భాశయ కాన్సర్‌తో బాధపడుతూ మహాత్మా గాంధీ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో కుటుంభం పోషణ కష్టంగా ఉండటంతో చేయుత నందివ్వాలని రోటరీ క్లబ్ వారిని అభ్యర్థించారు. వెంటనే అధ్యక్షులు జెసి రాజు ఐదు వేల రూపాయల వితరణతో రోటరీ క్లబ్ సెక్రటరీ శ్రీ హరి, రీజినల్ చైర్ చంద్ర కిషోర్, కోశాధికారి శ్రీనివాసన్ బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించారు.

రహదారి మధ్యలో బ్రిడ్జ్ శిధిలం

విశాలాంధ్ర - మెరకముడిదాం : కొత్త కర్ర బుదరాయవలస ఆర్అండ్‌బి రోడ్డులో మధ్యలో బ్రిడ్జ్ శిధిలం అయినది. దీనివలన పెను ప్రమాదం పొంచిఉంది. గొయ్య ఏర్పడిన రోజులు గడుస్తున్నా ఇంతవరకు సంబంధిత ఆర్అండ్‌బి అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో స్థానికులు ఆందోళన, చెందుతున్నారు. కనుక వాహనాలు రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడడంతో పాటు రాత్రి సమయంలో ప్రమాదం జరిగేందుకు ఆస్కారం ఉన్నది. అంతేకాకుండా కొత్త కర్ర నుండి బుదరాయవలస స్కూలుకు వెళ్లే పిల్లలు సంచరించే సమయములో గోతులో జారిపడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాబట్టి సంబంధిత ఆర్అండ్‌బి అధికారులు స్పందించి. తక్షణమే పనులు చేపడతారని స్థానికులు కోరుచున్నారు.

అవ్వ తాతలకు నేత్ర శస్త్ర చికిత్సలు కోసం తరలింపు

విశాలాంధ్ర - కురుపాం : డా వై యస్ ఆర్ అవ్వ తాత కంటి వెలుగు కార్య క్రమం లో బాగంగా కురుపాం , గుమ్మలక్ష్మీపురం మండలాల లో వున్న సచివాలయాల పరిధిలో వున్న గ్రామాలలో గతంలో నిర్వహించిన డా. వై.ఎస్.అర్ అవ్వ తాత కంటి వెలుగు వైద్య శిభిరా లలో ఇప్పటి వరకు నిర్వహించిన నేత్ర పరీక్షలు లలో కేటరాక్ట్(అంతర కుసుమం) టేరిజియం (కొయ్యకండ) వున్న వారిని గుర్తించి వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కోసం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం నుండి పుష్ప గిరి కంటి ఆసుపత్రి విజయనగరం కి 30 మందిని శుక్రవారం తరలించారు. శనివారం శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని మన్యం జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు.వీరందరికీ ఉచిత రవాణా,వసతి, భోజనం, కళ్ళ జొళ్ళు,మందులు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. శస్త్ర చికిత్సలు కు వెళుతున్న రోగులకు పలు సూచనలు,జాగ్రతలు వివరించారు.డా వైయస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా మా లాంటి అవ్వ తాత లకు కంటి చూపును తెప్పించే బాధ్యత గా తీసుకొని మాకు దగ్గర వుండి అన్ని సదుపాయాలు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కి రోగులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్య క్రమం లో కంటి వైద్య సహాయకులు శైలజ, మల్లిక,ఆషా కార్య కర్తలు పాల్గొన్నారు.

తిమిడి గ్రామంలో పొలంబడి నిర్వహణ

విశాలాంధ్ర - శృంగవరపుకోట : మండలం లోని తిమిడి గ్రామంలో ఏఓ రవీంద్ర ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ సీజనులో పొలంబడి మొదలుపెట్టే ముందుగా రైతులును ఎంపిక చేసుకోవాలని, వారందరితో ఒక సమావేశం నిర్వహించుకోవాలని సూచించారు. గ్రూపులో 30 మంది రైతుల వివరాలు బేస్ లైన్ సర్వే ద్వారా సేకరించాలని కోరారు. గ్రామంలో రైతులు అనుసరిస్తున్న పద్ధతులను వారితో చర్చించి మార్పు చేయవలసిన యాజమాన్య పద్ధతులు, అధునాతన పంటల సాగు గురించి చర్చించారు. అదే విధంగా 14 వారాల పొలంబడిలో చేపట్టే పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ రవి, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

నిడగల్లులో లేగదూడలు ప్రదర్శనకు అనూహ్య స్పందన

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని నిడగల్లు పశువైద్య కేంద్రంలో శుక్రవారం విజయనగరం డిఎల్‌డిఎ ఆధ్వర్యంలో లేగదూడలు ప్రదర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనూహ్య స్పందన లభించిందని పశువైద్యశాఖజిల్లా అధికారులు డాక్టర్ ఎన్ దామోదరరావు, డాక్టరు బి.శ్రీనివాసరావు, డాక్టరు రెడ్డి నీలయ్యలు తెలిపారు. 43లేగదూడలు ప్రదర్శనలో పాల్గొనగా వాటిలో ఎన్ కామయ్య, బి.లక్ష్మునాయుడు, వి.రామకృష్ణల లేగదూడలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు పొందారు. పశుసంపదను కాపాడాలని, పశువుల పట్ల రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రైతులు పశు సంపదను కాపాడుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో డాక్టరు కె. ప్రసాదరావు, డాక్టరు చింతాడ దీనకుమార్, డాక్టర్ బి. చక్రదర్, డాక్టరు సిరిపురపు రామారావు తోపాటు సిబ్బంది సంజీవరావు, చంద్ర శేఖర్, పశువైద్య సహాయకులు, సచివాలయం సిబ్బంది, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోను సందర్శించిన జోన్ డిప్యూటీ చీఫ్ మేనేజర్

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఆర్టీసీ జోన్ డిప్యూటీ చీఫ్ మేనేజర్ (ఆపరేషన్ కమర్షియల్) బి. అప్పల నాయుడు శుక్రవారం తన సిబ్బందితో కలిసి ఎస్.కోటలోని ఆర్టీసి డిపో, కాంప్లెక్స్ ను సందర్శించారు.

ఈ సందర్భంగా డిపోలోని గ్యారేజ్, బస్ స్టేషన్, పార్సెల్ కౌంటర్లు తనిఖీ చేసి ఉద్యోగులు, డిపో మేనేజరుకి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. బస్ స్టేషన్లో ప్రయాణీకులతో కూడా మాట్లాడి డిపో పరిధిలో ఆర్టీసీ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కె. రమేష్, సూపర్ వైజర్లు, గ్యారేజ్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పయ్యపేటలో కుటుంబ వైద్య శిబిరం నిర్వహణ

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని సీతానగరం పిహెచ్‌సి పరిధిలోని అప్పయ్యపేట ప్రాంగణంలో శుక్రవారం కుటుంబ వైద్యశిబిరాన్ని 104 ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యులు శిరీష ఆధ్వర్యంలో రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు అందజేసారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రజలు ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేడినీళ్లు, వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఫ్రైడే డ్రైడే గూర్చి వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ బురిడి కుసుమ సూర్యనారాయణ, ఎంఎల్‌హెచ్ పి సంధ్య, 104 సిబ్బంది జగదీష్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణరావు

విశాలాంధ్ర - బొబ్బిలి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్య క్రమంని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వెంకట మురళీకృష్ణ రావు పిలుపునిచ్చారు. పురపాలక సంఘంలో 8, 16వ

సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ సావు పాల్గొని సురక్ష కార్యక్రమంలో భాగంగా 8,16వ సచివాలయ పరిధిలో వారం రోజులు పాటు ప్రభుత్వ అధికారులు,వాలంటీర్లు సర్వే చేపట్టి ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు కోసం నమోదు చేయగా మంజూరు కాబడిన ధ్రువీకరణ పత్రాను మున్సిపల్ చైర్మన్ సావు చేతులు మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్తారు శ్రీనివాస రావు , మున్సిపల్ మేనేజర్ శివ ప్రసాద్, బుడ చైర్మెన్ ఇంటి పార్వతి, పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాల్ రావు, కౌన్సిలర్స్ శీర శ్రీలక్ష్మి, చోడిగింజల అనసూయమ్మ కౌన్సిలర్ ప్రతినిధి వాడపల్లి మనోజ్ కుమార్, కో ఆప్షన్ మెంబర్ రియాజ్ ఖాన్ , మరియు 18వ వార్డ్ వైసిపి ఇంఛార్జి కుసురెడ్డి దేవి, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

విశాలాంధ్ర - శృంగవరపుకోట : స్నేహ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శృంగవరపుకోట ఆర్టీసీ డిపో ఆవరణలో స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 25 కొబ్బరి, సపోటా, ఉసిరి, మామిడి, జామ రకాలైన మొక్కలను డిపో మేనేజర్ కె.రమేష్ ఆధ్వర్యంలో నాటారు. ఈ కార్యక్రమాన్ని విన్నకోట శ్రీరామమూర్తి ఆర్థిక సౌజన్యంతో నిర్వహించినట్లు స్నేహ సంస్థ కార్యదర్శి మంథా సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు డాక్టర్ పొట్నూరు వరలక్ష్మి, మళ్ల రామకృష్ణ, ఎం.ప్రకాష్, వి.మురళి వి.రాము, హరీష్, వి.రమేష్, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, జి. లక్ష్మణరావు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో 11 రకాల సేవలు

విశాలాంధ్ర - మక్కువ : మన్యం జిల్లా పార్వతీపురం మక్కువ మండలంలో చెముడు గ్రామ పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో 11 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని. కాస్ట్ ఇన్కమ్ బాత్ సర్టిఫికెట్ ఆధార్ కార్డ్ రేషన్ కార్డ్ ఫోన్ నెంబర్ లింకులు

పత్రాలు మ్యారేజ్ సర్టిఫికెట్లు అనేక రకాల సేవలు మన ఇంటి ముందుకు వచ్చి వాలంటరీల ద్వారా సేవలందిస్తున్న మన జగనన్నకు మరొకసారి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు జగనన్న నవరత్నాలు అమ్మఒడి జగనన్న గోరం ఉందా జగనన్న చేయూత జగనన్న చేతోడు జగనన్న రైతు మిత్ర జగనన్న రైతు భరోసా అనే కార్యక్రమాలు మన జగనన్నకే సాధ్యం మంచి భవిష్యత్తు కావాలంటే మంచి విద్య కావాలంటే మనకు జగన్ రావాలి జగన్ కావాలి అని నినాదాన్ని ప్రజలందరికీ నేరుగా అందించాలని అతని యొక్క స్వభావం తెలియపరుస్తున్నారు,లిచెముడు గ్రామపంచాయతీలో రైతు భరోసా కేంద్రం ప్రారంభించిన వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షులు మామిడి రంగు నాయుడు ఎంపీడీవో సూర్యనారాయణ రెవెన్యూ డిపార్ట్మెంట్. చెముడు సర్పంచ్ బొంగు రాజేశ్వరమ్మ బొంగు భీమలింగేశ్వరరావు ఎంపీటీసీ చింతల గోపాలకృష్ణ సచివాలయ సిబ్బంది వైయస్సార్ నాయకులు వాలంటరీలు కన్వీనర్లు గృహ సారథులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం పాల్గొన్నారు.

రాతీ క్వారీ పనులకై గిరిజనులకు అనుమతులు ఇవ్వండి

గిరిజనాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఐటిడిఏ పిఓకి వినతి

విశాలాంధ్ర - కురుపాం : రావాడ గిరిజనులు కు క్వారీ అనుమతులు మంజూరు చేయాలని గిరిజనాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పార్వతీ పురం ఐటిడిఎ పీఓ విష్ణుచరణ్ ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు ఆరిక. చంద్రశేఖర్ మాట్లాడుతూ జియ్యమ్మవలస మండలంలో రావాడ గ్రామానికి చెందిన 70 గిరిజన కుటుంబాలు గత ముప్పై సంవత్సరాలుగా కొండపోలం రాతీ క్వారీ నీ నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయి. అయితే గత 20 రోజుల క్రితం మైనింగ్ అధికారులు పనులు నిలిపివేయడంతో ఆ గిరిజన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వారికి మైనింగ్ పర్మిషన్ ఇప్పించి గిరిజన కుటుంబాలను ఆదుకోవాలని పార్వతీపురం ఐటిడిఎ పథక నిర్వహణ అధికారి సి.విష్ణుచరణ్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది.ఆయన సానుకూలంగా స్పందించి మైనింగ్ అధికారుల తో మాట్లాడి సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.మణీకేశ్వరారావు, శ్రీనివాసరావు, అప్పల నాయుడు, వెంకట రమణ,సంతోష్, శ్రీనివాసరావు పోలిరాజు, రమణ, శ్రీనివాసరావు, బాబురావు, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు నిష్పక్షపాతంగా అందించటానికే సురక్ష

విశాలాంధ్ర - వంగర : ప్రజలకు సంక్షేమ పథకాలు అందించటంలో మధ్యవర్తులు, దళారులు ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలందరికీ అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిదే నని ఎంపీపీ వి.సురేష్ ముఖర్జీ అన్నారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా నేరుగా ప్రభుత్వ పథకాలు నగదు తమ ఖాతాలలోకే పడుతున్నాయని మహిళలు ప్రభుత్వ పాలన పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా, కులం మతం,పార్టీలు చూడకుండా అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ప్రతి కుటుంబానికి రూ. లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి కలుగుతోందని, ఈ సంక్షేమ పథకాలు మరింత మెరుగ్గా అమలు జరగాలంటే మళ్ళీ జగన్ మోహన్ రెడ్డిని సీఎంగా చేయటానికి సహకరించాలని ఆయన ప్రజలను కోరారు. జగన్ అందిస్తున్న సుపరిపాలన ఎంతగానో ప్రజాబి,మానాన్ని పొందిందన్నారు. జగన్ మోహన్ రెడ్డిని అధికార పీఠంపై నిలిపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అర్హులకు నిస్పక్షపతంగా ప్రభుత్వ పథకాలు అందించటానికే సురక్ష కార్యక్రమం ఏర్పాటుచేసిందినీ సురేష్ ముఖర్జీ అన్నారు. శుక్రవారం నాడు వంగరలో సురక్ష కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం ప్రజల కష్టాలు తీర్చటానికి, గ్రామస్థాయిలో సచివాలయ వాలంటీ ర్ వ్యవస్త తీసుకొచ్చిందని దీనివల్ల ప్రజలకు అందుబాటులో పరిపాలనను అందించటానికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. గ్రామాల్లో వాలంటరీ వ్యవస్థ వల్ల ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వారి ఇళ్లకే అందిస్తున్నారని ఆయనన్నారు.

క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి, పరిష్కరించాలి

మాసాంతర నేర సమీక్షా సమావేశంలో విజయనగరం జిల్లా ఎస్పీ ఎం.దీపిక

విశాలాంధ్ర - విజయనగరం : జిల్లా పోలీసు అధికారులతో మాసాంతర నేర సమీక్షా సమా వేశాన్ని ఎస్పీ ఎం. దీపిక శుక్రవారం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ - పోలీసు అధికారులు, సిబ్బంది విస్తృతంగా గ్రామ సందర్శనలు చేసి, క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీసు స్టేషను పరిధిలోనిగ్రామాలు/వార్డుల్లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు ఆధారంగా సమస్యాత్మక, తీవ్ర సమస్యాత్మక, సాధారణ గ్రామాలు/వార్డులు గా విభజించి, పోలీసు స్టేషనులో పని చేసే సిబ్బందికి ఆయా గ్రామాలు, వార్డులను దత్తతగా ఇవ్వాలన్నారు. దత్తతగ్రామాల్లో సిబ్బంది తరుచూ సందర్శనలు చేస్తూ, గ్రామాల్లో వివాదాలకు అస్కారం ఉన్న సమస్యలను ముందుగా గుర్తించి, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళాలన్నారు. గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రాథమికస్థాయిలోనే గ్రామాల్లో సభలు నిర్వహించి, సంబంధిత వర్గాలతో మాట్లాడి, సమస్య తీవ్రతరం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమస్యలు సృష్టించే వ్యక్తులను ముందుగా గుర్తించి, వారిని ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చి, మంచి ప్రవర్తన కోసం బైండోవరు చేయాలని, వారి వద్ద నుండి సెక్యూరిటీ బాండులను తీసుకోవాలన్నారు. బైండోవరు చేసినప్పటికీ తగాదాల్లో భాగస్వామ్యులైతే వారిపై సెక్యూరిటీ

బాండుగా ఇచ్చిన మొత్తాన్ని వసూలు చేస్తామన్న విషయాన్ని సంబంధిత వ్యక్తులను తెలియజేయాలన్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు, పేకాటలు జరగకుండా నిఘా ఏర్పాటు చేసి, దాడులు నిర్వహించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. అనంతరం, వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్, కొట్లాటలు, హత్యాయత్నం కేసులను జిల్లా సమీక్షించి, దర్యాప్తు పెండింగు లో ఉన్న కేసుల్లో దర్యాప్తు పూర్తి చేయాలని, కోర్టుల్లో అభియోగ పత్రాలు దాఖలు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎం. దీపిక ఆదేశించారు.

ప్రతిభ కనబర్చిన అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేసిన జిల్లా ఎస్పీ

ఎస్.కోట పోలీసు స్టేషను పరిధిలో గంజాయి అక్రమ రవాణను నియంత్రించేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, గంజాయి అక్రమ రవాణాదారులపై మూడు కేసులు నమోదు చేసి, భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎస్.కోట ఎస్ఐ జి. లోవరాజును జిల్లా ఎస్పీ ఎం.దీపిక నేర సమీక్షా సమావేశంలో ప్రత్యేకంగా అభినందించి, "బెస్ట్ ఫెర్ఫార్మర్" జ్ఞాపికను ప్రదానం చేసారు. అదే విధంగా వివిధ కేసుల్లో నిందితులను అరెస్టు చేసి, పోయిన ఆస్తులను రికవరీ చేయుటలోను, వివిధ రకాలైన పోలీసు విధులను సమర్ధవంతంగా నిర్వహించుటలో ప్రతిభ కనబర్చిన సిఐలు కే. రవికుమార్, హెచ్. ఉపేంద్ర, జి.సంజీవరావు, ఎస్ఐలు జె. తారకేశ్వరరావు, బి.సాగర్‌బాబు, సిద్ధార్ధ్ కుమార్, ఎఎస్ఐలు ఎ.లకు నాయుడు, ఎస్.భాస్కరరావు, సిహెచ్.ఆరి, ఆర్. అప్పారావు, హెచ్సీలు ఆర్. మధుసూధనరావు, డి.శంకర్రావు, ఎండి ఇమ్రాన్, కానిస్టేబుళ్ళు ఎం.రఘు, ఎ.పాండురంగ, ఎస్. రమణ, ఎస్.గౌరీ శంకర్, టి.శ్రీనివాస రావు, ఎం.విజయ కుమార్, ఎ.సిహెచ్. శేఖర్, కే.సూరపు నాయుడు, ఎస్.సత్యం నాయుడు, బండి రాజు, బి. రమేష్, కే.శ్రీనివాసరావు, ఎస్.రామా రావు, ఎ.రాంబాబు, ఎస్.శ్రీహరి, ఎ.ఎస్.చక్రవతి, పి.నాగరాజు, హెూంగార్డు వై.రాజేంద్రలను జిల్లా ఎస్పీ ఎం.దీపిక ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేసారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, విజయ నగరం డిఎస్పీ ఆర్. గోవిందరావు, చీపురుపల్లి డిఎస్పీ ఎ.ఎస్.చక్రవర్తి, బొబ్బిలి డిఎస్పీ పి.శ్రీధర్, ఎస్సీ మరియు ఎస్టీ సెల్ డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, డిటిసి డిఎస్పీ వీరకుమార్, ఎఆర్ డిఎస్పీఎల్. శేషాద్రి, న్యాయ సలహాదారులు వై.పరశురాం, సిఐలు కే.కే. వి. విజయనాథ్, జె. మురళి, ఈ.నర్సింహ మూర్తి, బి.వెంకటరావు, విజయ ఆనంద్, బి.నాగేశ్వరరావు, ఎం. నాగేశ్వరరావు, హెచ్.ఉపేంద్రరావు, కే.రవి కుమార్, ఎల్. అప్పలనాయుడు, వి. చంద్రశేఖర్, ఎం. బుచ్చిరాజు, ఎస్. తిరుమలరావు, టివి తిరుపతిరావు, వివిధ పోలీసస్టేషనుల్లో పని చేస్తున్న ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.